
భాగ్యరచనా కలము
కర్మ

ప్రథమ ప్రచురణ, నవంబరు 2013, 3000 ప్రతులు

**రచన మరియు చిత్రాలుః**

బ్రహ్మాకుమార్ బురహానుద్దీన్ అలి

ఆబూరోడ్, రాజస్థాన్.

**అనువాదముః**

బి.కె.వీణా కుమారి

**ప్రచురణకర్త**

హెల్తీ వెల్తీ హేప్పీ క్లబ్, అహ్మదాబాద్

**ముద్రణ**

అంబా ఆఫ్ సెట్, అహ్మదాబాద్

**పుస్తకములు లభించు చోటుః**

ఫరిస్తా కలెక్షన్స్, శాంతివనము, ఆబూరోడ్

ఫోన్ః 098284-28024

Teleugu Edition
© copyright: ‘Healthy Wealthy Happy Club’, Ahmedabad.
No part of this book may be printed or used through any other mode without the permission of the publisher.

# భూమిక

కలియుగము అంతరించి సత్యయుగము ప్రారంభమయ్యే యుగ పరివర్తనా సమయములో ప్రస్తుతం మనమంతా జీవిస్తున్నాము. ఈ పావన సమయమునే సంగమయుగము అంటారు. ఈ సమయములోనే స్వయం పరమాత్ముడు ఈ భూమిపై అవతరించి మానవాత్మలను పావనం చేసి సత్యయుగాన్ని పునః స్థాపిస్తున్నారు.

పరమాత్ముడు జ్ఞానసాగరుడు, వారు నేర్పిస్తున్న ప్రముఖ శిక్షణలలో అతి ముఖ్యమైన విషయము కర్మల గుహ్య జ్ఞానము. నిత్యం జరుగుతున్న ఘటనల్లోకొన్ని మనకు సంతోషాన్ని కలిగిస్తే మరికొన్ని దుఃఖాన్ని కలిగిస్తుంటాయి. వీటిని భగవదేచ్ఛగా మనం భావిస్తుంటాం. మనకు మేలు జరిగితే భగవంతునికి ధన్యవాదాలు తెలుపుతుంటాం, కీడు జరిగితే ఆ దోషాన్ని భగవంతునిమీదకు నెట్టేస్తుంటాం. మానవుని జీవితంలో సంభవిస్తున్న ఈ ఘటనలకు నేను బాధ్యుడనుకాదు, మానవ తప్పిదములేనని ఈ సందర్భముగా భగవంతుడు మనకు తెలియజేస్తున్నారు. మానవులకు వారి కర్మలనుసారముగానే ఫలితం లభిస్తుంటుంది. భగవంతుడు ఎవ్వరి వ్యక్తిగత జీవితములోనూ కలగజేసుకోరు. భగవంతుడు సుఖసాగరుడు, వారు ఎవ్వరికీ దుఃఖము కలిగించరు.

అతి ప్రాముఖ్యత కలిగిన ఈ విషయాన్ని అందమైన ఒక కథగా ఈ చిన్ని పుస్తకములో వివరిస్తున్నాము. ఇందులో కర్మ సిద్ధాంతములోని లోతైన రహస్యాలను మరియు భగవంతుని ద్వారా లభించిన శిక్షణలను కూడా జోడించారు. ముఖ్యముగా ఆత్మ జ్ఞానము, పరమాత్ముని సత్య పరిచయము, రాజయోగాభ్యాసము, కాలచక్ర జ్ఞానము ఈ కథ ద్వారా పరిచయమవుతాయి.

ఈ పుస్తకమును చదివిన తరువాత మీ జీవితములో సకారాత్మక పరివర్తన, ఆలోచనల్లో అనూహ్యామైన పరివర్తన చోటుచేసుకుంటుందని భావిస్తున్నాను. మానవుడు కర్మల ద్వారా తన భాగ్యమును ఎలా రచించుకొనుచున్నాడో కూడా మీరు తెలుసుకుంటారు.

ఈ పుస్తకమును చదివి మీరు లాభాన్వితులై మీ బంధు మిత్రులకు బహూకరించి వారిని కూడా ఈ శ్రేష్ఠ జ్ఞానముతో లాభాన్వితులను చేస్తారని ఆశిస్తున్నాను.

**– బి.కె. సి.ఎ. లలిత్ ఇనాణి**



# భాగ్యరచనా కలము– కర్మ

భారతదేశ వాణిజ్య రాజధాని ముంబయి పట్టణములో ఆకాశాన్నంటే ఎత్తైన మేడలు ఒకవైపు కనువిందు చేస్తుంటే దయనీయస్థితిలోని మురికివాడలు కూడా దర్శనమిస్తుంటాయి. అక్కడి మురికి వాడల్లోని ఒక పూరి గుడిసెలో 7 సంవత్సరాల చిన్నారి రాజు తన తల్లితో నివసిస్తుండేవాడు. అతని తండ్రి చాలా కాలం ముందే చనిపోయాడు. అతని పాలన, పోషణ తల్లియే చూస్తుండేది. ఆ ప్రాంతములోని భవన నిర్మాణ కార్యములో కూలి పని చేస్తూ ఆమె ధనము సంపాదించేది.

ఎప్పటివలె రాజు కూలిపనికి వెళుతున్న తన తల్లితో కలసి వెళ్తున్నాడు. ఈ రోజు తన జీవితములో తీరని దుఃఖ సంఘటన జరగబోతున్నదని బహుశా అతనికి తెలియదు. రోడ్డు దాటుతున్న రాజు అవతలివైపునున్న గాలి బుడగలను చూసి కేరింతలు కొడుతూ తన తల్లి చేతిని విడిచి రోడ్డు దాటటానికి ఆ ట్రాఫిక్‌లో పరుగులు పెడుతున్నాడు. అతడి తల్లికొడుకును పట్టుకోవడానికి ఆ బాబు వెనకాలే పరిగెడుతున్నది. కెవ్వుమనే స్వరం తో ఆ ప్రాంతమంతా ఉన్నట్టుండి నిశ్శబ్దముగా మారిపోయింది. ఆ ఆర్తనాదం రాజుది కాదు, అతడి తల్లిది. వెనక్కి తిరగి చూశాడు. తల్లి మృతదేహము రక్తసిక్తమై రోడ్డుపై పడి ఉన్నది. ఏడుస్తూ తన తల్లి వద్దకు పరిగెడుతూ వచ్చాడు. ఇప్పుడు రాజు పూర్తిగా ఒంటరివాడయ్యాడు. అతి పిన్న వయస్సులో అనాథ అయ్యాడు. ఒక చిన్న పొరపాటు వలన తల్లి శాశ్వతముగా దూరమయింది. ప్రపంచములో తనకంటూ ఇక ఎవరూ లేరు.

ఎంతో సందడి చేసే రాజు తల్లి మరణానంతరము చెప్పలేనంత నిరుత్సాహముతో ఉంటున్నాడు. జీవితము శాపమైపోయింది.తన పొట్ట తానే నింపుకోవలసిన అగత్యము ఏర్పడింది.



దిక్కులేని రాజు కొన్ని రోజులు తన పూరిగుడిసెలోనే నిరాశగా కూర్చుండిపోయాడు. అన్ని రోజులు తినటానికి కూడా ఏదీలేదు. ఇలా ఎన్ని రోజులు ? పొట్ట నింపుకోవాలి కదా. ఒక టీ బండి వద్ద పని చేయటానికి కుదిరాడు. ఆ టీ బండి యజమాని ఎప్పుడూ చిటపటలాడుతూ చిన్న చిన్న విషయాలకే రాజును తిడుతుండేవాడు, కొడుతుండేవాడు కూడా. ఒకరోజు పొరపాటుగా రాజు చేతి నుండి టీ గ్లాసు కింద పడి పగిలిపోయింది. ఇంకేముంది, ఏ మాత్రము దయ లేకుండా రాజును యజమాని బాగా కొట్టాడు. చిన్నారి రాజు ఏమి చేయగలడు. క్షమాపణ మాత్రమే యాచించగలడు. ఇలా అతడి బాల్యమంతా దాస్యములోనే గడచింది.

ఒకరోజు రాత్రి రాజు తన ఇంటికెళ్లేటప్పటికి పొరుగునున్న ఒక వ్యక్తి రాజు గుడిసెను ఆక్రమించుకున్నాడు. దయ చూపమంటూ ఆ వ్యక్తి వద్ద రాజు ఎంతగానో ఏడ్చాడు. అయినా ఆ వ్యక్తి ఏ మాత్రము చలించలేదు. పైగా రాజును బాగా కొట్టి, బెదిరించి అక్కడి నుండి తరిమేశాడు. ఇప్పుడు రాజుకు ఇల్లు కూడా లేదు. పుట్‌పాత్ పైనే ఉంటున్నాడు.

పుట్టిన కొద్ది రోజులకే తండ్రిని కోల్పోయాడు. బాల్యములోనే తల్లి కూడా దూరమయింది, రాజు నష్టజాతకుడంటూ అందరూ అతన్ని నిందించేవారు. ఎవ్వరూ అతడితో స్నేహము చెయ్యటానికి ఇష్టపడేవారు కాదు. రాజు జీవితములో ప్రతిరోజు కొత్తగా ఏదో ఒక కష్టము వచ్చిపడుతూ ఉండేది.

దుఃఖపూరితమైన జీవితము వలన రాజు ఎప్పుడూ చిటపటలాడుతూ ఉండేవాడు. తన దురదృష్టానికి ప్రతిరోజు ఏడుస్తుండేవాడు. భగవంతుడిని నిందిస్తుండేవాడు.తన జీవితములో జరుగుతున్న ఘటనలన్నిటికి భగవంతుడే బాధ్యుడని భావిస్తూ జీవితము వెళ్లదీస్తున్నాడు.



నెమ్మది నెమ్మదిగా సమయము గడుస్తున్నది, చిన్నారి రాజు ఇప్పుడు యువకుడయ్యాడు. కాలగమనములో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ఒకవిధముగా వాటికి అలవాటు పడిపోయాడు. ఎలాగో తనకంటూ ఒక గుడిసెను నిర్మించుకోగలిగాడు. సంపాదన కోసము టీ బండి పెట్టుకున్నాడు. చీటికి మాటికి చిటపటలాడే స్వభావము కలిగినందున అతని బండి వద్దకు చాలా తక్కువ మంది వచ్చేవారు. అందువలన సంపాదన కూడా తక్కువగానే ఉండేది. ఇందుకు కూడా తన దురదృష్టమేకారణమని భావించేవాడు.

రమ అనే యువతితో అతని వివాహము జరిగింది. ఆమె మహా కోపిష్టి, గయ్యాళి. చీటికి మాటికి కోప్పడుతూ ప్రతిరోజు రాజు పేదరికాన్ని దెప్పిపొడిచేది. తన గయ్యాళి భార్య కారణముగా రాజు ఉదాసీనముగా ఉండేవాడు. వారిద్దరి మధ్య గొడవ జరగని రోజంటూ ఉండేది కాదు.

దీంతో రాజు త్రాగుడుకు అలవాటు పడ్డాడు. సంపాదించినదంతా త్రాగటానికే తగలేస్తున్నాడంటూ అతని భార్య ప్రతిరోజు గొడవ చేస్తుండేది. త్రాగుడు వలన అతడి జీవితము మరీ దిగజారిపోయింది.

ప్రతిరోజు రాత్రిపూట చాలా ఆలస్యముగా ఇంటికి వచ్చేవాడు. వస్తూనే భార్యతో గొడవ పడుతుండేవాడు. అంతేకాదు త్రాగిన మత్తులో వీధిలోని వారితో కూడా గొడవపడేవాడు. ఆ గొడవల్లోకొన్ని సార్లు జైలుపాలయ్యాడు. అయినా త్రాగటం మాత్రము వదల్లేదు.

బాల్యము నుండి అతడి జీవితము అంతులేని దుఃఖములోనే గడిచింది. తృప్తిగా నవ్వుతూ గడిపిన రోజులే అతనికి జ్ఞాపకము లేవు. ఆ వాడలోని వారంతా ఇప్పటికీ అతన్ని నష్టజాతకుడు గానే జమకడుతున్నారు. అతడితో మాట్లాడటానికి కూడా ఎవ్వరూ ఇష్టపడే వారు కాదు.



ఒకరోజు కొందరు దుష్టులు రాజు బండి వద్దకు టీ త్రాగటానికి వచ్చారు. టీ ఇమ్మని గద్దించారు. రాజు టీ ఇచ్చి తరువాత డబ్బులు అడిగాడు. దాంతో వారికి చాలా కోపము వచ్చింది. రాజును గేలి చేయటం మొదలు పెట్టారు. రాజు కూడా ఆవేశములో ఆలోచన కోల్పోయి నోటికొచ్చినట్లు మాట్లాడాడు. దాంతో వారింకా రెచ్చిపోయారు. వారిలో ఒకడు బండిని కింద పడేసి సామాన్లన్నిటిని రోడ్డు మీదకు విసిరేశాడు. రాజు అడ్డుపడితే అందరూ కలసి చితకబాదారు. కదలలేని స్థితిలో పడిఉన్న రాజును అక్కడే వదిలేసి, అతణ్ణి బాగా బెదిరించి ఆ దుష్టులు వెళ్ళిపోయారు.

బజారులోని వ్యక్తులంతా ఈ దృశ్యాన్ని తమాషాగా చూస్తున్నారేకాని ఒక్కరు కూడా రాజుకు సాయపడలేదు. కాసేపటికి మెలకువలోకి వచ్చిన రాజు చెల్లాచెదురుగా పడి ఉన్న సామాన్లన్నిటిని బండిపై వేసుకొని ఇల్లు చేరిదీనంగా భార్యను పిలిచాడు. అప్పటికే చీకటి పడింది. అతడి భార్య ఓదార్చటానికి బదులు విరుచుకుపడటం మొదలుపెట్టింది. వాడలోని వ్యక్తులంతా గుంపుచేరి, వీరి గొడవను ఆస్వాదించారు. దీంతో రాజు మరీ నిరాశకు గురయ్యాడు. ఓదార్పునిస్తారని ఎదురుచూసినందుకు ఆ ఏకైక వ్యక్తి నుండి కూడా అతనికి ఓదార్పు లభించలేదు.

రాజుకు ఇప్పుడు తన జీవితము మరీ దుఃఖభరితముగా అనిపిస్తున్నది. అలిగి ఆకాశము వైపు చూస్తూ తనకు జరిగిన అన్యాయానికి భగవంతుడే బాధ్యుడంటూ దూషించటం మొదలుపెట్టాడు. తనకు ఇష్టమొచ్చినట్లు భగవంతున్ని నిందిస్తున్నాడు. ఓ భగవంతుడా, నేను నా జీవితములో ఎవ్వరికీ చెడు చేయలేదు. కాని నాకెప్పుడూ కీడే ఎందుకు జరుగుతున్నది.... అంటూ తన వ్యథను వెళ్ళబోసుకుంటున్నాడు. తరువాత కాసేపటికి నిరాశగా తన గుడిసెలో ఒక మూల కూర్చొని ఏడుస్తూ ఏడుస్తూ అలాగే నిద్రలోకి జారుకున్నాడు.



రాత్రి బాగా పొద్దు పోయాక, చుట్టూ నిశ్శబ్దము ఆవరించిన ఆ క్షణములో రాజుకు ఒక అలౌకిక స్వరము వినిపించింది. నిద్ర నుండి మేల్కొన్నాడు. ఎదురుగా నలువైపులా ప్రకాశమే ప్రకాశము కనిపించింది. వాస్తవానికి అతడు ఒక విభిన్న లోకములోనికి వచ్చాడు. నలువైపులా దివ్య ప్రకాశము మరియు అలౌకిక శాంతి అనుభవమవుతున్నది. రాజుకు ఏమీ అర్థము కావట్లేదు. నేనిక్కడకు ఎలా వచ్చానని ఆలోచిస్తున్నాడు. బహుశా నేను చనిపోయానా అని తనలో తానే అనుకుంటూ చేతిని గిల్లి చూశాడు. అంతా బాగానే ఉన్నదే.

అంతలో రాజు మరలా ఆ అలౌకిక స్వరము విని చుట్టూ పరికించి చూశాడు. ఆ లోకములో తాను తప్ప ఇంకెవ్వరూ లేరు. లోలోపల భయము వేయసాగింది. "ఎవరు మీరు" అంటూ భయపడుతూనే గట్టిగా అరిచాడు.

అప్పుడు అతని ఎదురుగా ఒక దివ్యమైన జ్యోతి సాక్షాత్కరించింది. ఆ దివ్యజ్యోతి నుండి వెలువడుతున్న అలౌకిక ప్రకాశము నలు దిక్కులా వ్యాపిస్తున్నది. కొద్దిసేపు రాజు ఆ అలౌకిక అనుభవములోనే మునిగిపోయాడు. ఆ దివ్యజ్యోతి మరెవరో కాదు, స్వయం నిరాకార పరమాత్ముడే. పరమాత్ముడు రాజుతో మాట్లాడటం ప్రారంభించారు.

పరమాత్మ: మధురమైన ఓ బిడ్డా, నేను.. నీ తండ్రిని.

రాజు: మీరు నా తండ్రి ఎలా అవుతారు, నా తండ్రి చాలా సంవత్సరాల క్రితమే చనిపోయాడు. నన్ను వెర్రివాడిని చేయకండి. మీరెవరో నిజంగా చెప్పండి.

పరమాత్మ: నేను నీ తండ్రినే. నీవు నా బిడ్డవు. చనిపోయిన ఆ వ్యక్తి నీ శరీరానికి తండ్రి. నేను నీ ఆత్మకు తండ్రిని. నేను సర్వ జగత్తుకు తండ్రిని. నన్నందరు పరమపిత పరమాత్మ అని పిలుస్తారు.



రాజుః (కోపంగా) అవునా, మీరేనా భగవంతుడు. నాకు మీపై చాలా కోపంగా ఉన్నది. మీరు నా జీవితమంతా దుఃఖమేనింపారు. బాల్యము నుండి మొదలుకొని ప్రతిసందర్భములో నాకు కీడే జరిగింది. మీకు నేను ఏంద్రోహము చేశాను. నాకు ఇంతటి దుఃఖము ఎందుకు కలిగిస్తున్నారు. ఇప్పుడైనా నాపైన కాస్త దయ చూపండి.

పరమాత్మః (నవ్వుతూ) నేను తండ్రిని. నేను నీకు దుఃఖాన్నెందుకు ఇస్తాను. నేను సుఖ సాగరుడను. దుఃఖహర్త సుఖకర్తను. నేనువిశ్వమంతటికి దుఃఖాన్ని హరించిసుఖాన్నిస్తాను. నేను ఎప్పుడూ ఎవరికీ బాధ కలిగించను బిడ్డా.

రాజుః (నిరాశతో)ఈ విశ్వాన్ని నడిపించేవారు మీరే. అందరికి సుఖదుఃఖాలు ఇచ్చేది మీరే. మీరు కాకుంటే నాకు ఇంతటి దుఃఖము ఎవరు కలిగిస్తున్నట్లు.

పరమాత్మః (ప్రేమతో) ఓ బిడ్డా, సుఖ-దుఃఖాలు కర్మ ఫలితాలు. ఇందులో నేనేమీ చేయను. ఎలాంటి కర్మ చేస్తారో అలాంటి ఫలితమే అనుభవిస్తారు.

రాజుః కాని నేను నా జీవితములో ఎవ్వరికీ అంతటి దుఃఖమివ్వలేదు. ఏ పాప కర్మ చెయ్యలేదు. అయినప్పటికి నాకు దుఃఖమే ఎందుకు ఎదురవుతున్నది ? బాల్యము నుండి మొదలుకొని ఇప్పటివరకు నాకు దుఃఖము తప్ప ఇంకేదీ లభించలేదు.

పరమాత్మః బిడ్డా, నీవు కేవలము ఈ వర్తమాన జన్మను మాత్రమే చూస్తున్నావు. నీ గత జన్మల కర్మల ఫలమే ఈ దుఃఖము.

రాజుః పూర్వ జన్మా.. అంటే ఏమిటి ? నేను ఈ జన్మకు ముందు కూడా మరొక జన్మలో ఉంటినా.



పరమాత్మః పూర్వజన్మల రహస్యాన్ని తెలుసుకోవటానికి ముందు నీ వాస్తవ స్వరూపమేమిటో, నీవు ఎవరివో తెలుసుకోవటం చాలా అవసరము.

రాజుః నేనెవరో నాకు తెలుసు. నేను రాజు. ముంబయి పట్టణములో టీ అమ్ముతుంటాను. ఈప్రపంచములో అందరికంటే అత్యంత దౌర్భాగ్యుడను.

పరమాత్మః ఇదే పెద్ద పొరపాటు. నిన్ను నీవు కనిపిస్తున్న శరీరముగా భావిస్తున్నావు. వాస్తవానికి ఈ ప్రపంచములో కనిపిస్తున్న మానవులెవరూ శరీరాలు కాదు. ఆ శరీరాలలో విరాజమానమై ఉన్న అవినాశి జ్యోతి ఆత్మలే.

రాజుః ఆత్మా ?

పరమాత్మః అవును, ఆత్మయే. నీవు ఒక ఆత్మవు.

రాజుః ఈ ఆత్మ ఏంటి ?

పరమాత్మః ఆత్మ అంటే ఒక చైతన్యమైన, దివ్యమైన శక్తి. అది శరీరాన్ని నడిపిస్తుంటుంది. ఈ ఆత్మయే శరీరము ద్వారా మంచి లేదా చెడు కర్మలు చేస్తుంటుంది. ఆకారములో ఇది అత్యంత సూక్ష్మమైన బిందువు మరియు అవినాశి. ఆత్మకు మరణము ఉండదు. మరణించేది శరీరము మాత్రమే. శరీరము పాతదైనపుడు లేదా ఏదైనా ప్రమాదములో పాడైపోయినపుడు ఆత్మ ఆ శరీరాన్ని వదలి మరొక శరీరాన్ని ధరిస్తుంది. ఆత్మ తన పాత శరీరాన్ని వదలివేయటాన్నే మృత్యువు అంటారు మరియు నూతన శిశు – శరీరాన్ని ధరించటాన్ని జన్మ అని అంటారు. ఒకదాని తర్వాత ఒకటిగా ఆత్మ చాలా జన్మలు ధరిస్తూనే ఉంటుంది. వీటినే పునర్జన్మలు అంటారు.ఈ జన్మకు మునుపు కూడా నీవు కొన్ని జన్మలు గడిపావు.



రాజుః అవునా, ముందు జన్మలో నేను ఎలా ఉంటిని ? ఏ కర్మల ఫలితముగా నాకు ఈరోజు ఇంతటి దుఃఖము లభిస్తున్నదో మీరు చెప్పగలరా ?

పరమాత్మః సరే, సరే. ఎందుకు చెప్పలేను. ఆ పూర్వజన్మల సాక్షాత్కారమును కలిగించటానికే నేను నీ ఎదుట ప్రత్యక్షమయ్యాను.

పరమాత్ముడు రాజుకు అతని గత జన్మలను చూపిస్తున్నారు.అతడిని ఒక ప్రాచీన నగరానికి తీసుకెళ్లారు. రాజు ఎదురుగా ఒక పెద్ద భవనము కనిపిస్తున్నది. అతడు తన జీవిత కాలములో మునుపెన్నడూ ఇంతటి భవ్యమైన భవనాన్ని ఎప్పుడూ చూడలేదు. కాసేపు దాన్నే చూస్తూ ఉండిపోయాడు. ఆత్రుతగా పరమాత్ముడితో ఇలా అడిగాడు


రాజుః ప్రభూ, మీరు నన్ను ఎక్కడకు తీసుకొచ్చారు ?

పరమాత్మః నేను నీకు నీ పూర్వజన్మను చూపిస్తున్నాను. ఈ నగరములోనే నీవు నీ మునుపటి జన్మ గడిపావు.

పరమాత్ముడు రాజును ఆ భవనము లోపలికి తీసుకెళ్లారు. భవనమంతటా గట్టి పహారా ఉన్నది. ఏ వ్యక్తిని చూస్తున్నా రాజుకు ఇదే తన గత జన్మ రూపమా అనే అనుమానముగా పరికించి చూస్తున్నాడు. తన గత జన్మ రూపాన్ని చూడటానికి చాలా ఆత్రుతతో ఉన్నాడు. అంతలో, భవనము లోపలి నుండి కొందరి దుఃఖ భరితమైన ఆర్తనాదాలు వినిపించాయి. దీనమైన వారి అరుపులు విని రాజు కాసేపు మిన్నకుండిపోయినా.. ఆగలేక పరమాత్ముడిని అడిగేశాడు.

రాజుః ఈ అరుపులు ఎక్కడి నుండి వస్తున్నాయి ?

పరమాత్మః దుఃఖభరితమైన ఈ అరుపులు ఈ భవనములోని బందీగృహాము నుండి వినిపిస్తున్నాయి.



పరమాత్ముడు రాజును బందీగృహము వైపుకు తీసుకెళ్లారు. అక్కడ, ఖైదీలను ఘోరంగా హింసిస్తున్నారు. హృదయవిదారకమైన వారి అరుపులతో ఆ ప్రాంతమంతాదద్దరిల్లుతున్నది. అక్కడున్న ఖైదీలు, క్షమించండంటూ సైనికులను వేడుకొంటున్నారు.

రాజుః వీరు చేసిన నేరము ఏమిటి ? ఎందుకు వీరినిలా హింసిస్తున్నారు ?

పరమాత్మః వీరు క్రూరుడైన తమ రాజు రాజవీరసింహునిపై తిరుగుబాటుచేశారు. అందువలన రాజు వీరిని బంధించి శిక్షిస్తున్నాడు.

రాజుః నిర్దోషులపై ఇంతటి అత్యాచారమా, ఈ అత్యాచారాన్ని మీరెందుకు ఆపటంలేదు ?

పరమాత్మః అది నా కర్తవ్యం కాదు. ఇదంతా కర్మల గుహ్య రహస్యము. ఎవరు ఎలాంటి కర్మలు చేస్తారో వారికి అలాంటి ఫలితం లభిస్తుంది. వీరిని హింసిస్తున్నవారికి కూడా దాని ఫలితం తప్పనిసరిగా లభిస్తుంది.

రాజుః అంటే ఈ ఖైదీలు కూడా ఎప్పుడో అలాంటి కర్మ ఏదో చేసి ఉంటారు, దాని ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నారు.

పరమాత్మః చక్కగా అర్థం చేసుకున్నావు. మానవులు తాము చేసిన దుష్ట కర్మలకు ఫలితం ఈ భూమిపైనే అనుభవిస్తారు. అది ఆ జన్మలోనైనా కావచ్చు, లేదా మరొక జన్మలోనైనా కావచ్చు.

రాజుః ప్రభూ, మీరు నా పూర్వజన్మను చూపించటానికి నన్ను తీసుకొచ్చారు. అయితే వీరందరిలో నేను ఎవరిని ?

పరమాత్మః (నవ్వుతూ) నీ గత జన్మను తెలుసుకోవటానికి చాలా ఉత్సాహంగా ఉన్నావే. అంతకంటే ముందు ఈ నిర్దోషులను ఇంతగా హింసిస్తున్న ఆ రాజును చూడవా,

రాజుః సరే, మీ ఇష్టం.

పరమాత్ముడు రాజూను మరొక విశాలమైన మరొక గదిలోకి తీసుకెళ్ళారు. అక్కడ రాజు రాజవీరసింహుడు మద్యం మత్తులో తూలుతూ తన మంత్రులు కొందరితో ఒక ముఖ్యమైన విషయమును గురించి చర్చిస్తున్నాడు.



రాజుః మీరు నన్ను ఎక్కడకు తీసుకొచ్చారు ?

పరమాత్మః ఇది ఆ రాజు గారి దర్బారు. అక్కడ కూర్చునిఉన్నాడే, అతనే రాజు, వీరు అతని మంత్రులు.

అంతలో ఒక సేవకుడు రాజు గారికోసం మద్యం తీసుకుని వచ్చాడు. మత్తులో ఉన్న రాజు అకారణముగానే అతడిని తూలనాడటం ప్రారంభించాడు. ఏమీ చేయలేని ఆ సేవకుడు మౌనంగా అక్కడి నుండి నిష్క్రమించాడు.

రాజుః అరే, ఈ రాజు ఎంతటి క్రూరుడు. పాపం, ఆ సేవకుడు అకారణముగా మాటలు పడ్డాడు.

పరమాత్మః తాగిన మత్తులో రాజు వివేకాన్ని కోల్పోయాడు. మద్యము మత్తును కలిగించి ఎలాంటి వారితోనైనా వికర్మలు చేయిస్తుంది. నీవు కూడా తాగిన మత్తులో ఎన్నో తప్పుడు పనులు చేస్తుంటావు. కావున ఇప్పటినుండి సారాయికి దూరముగా ఉండమని నిన్ను అర్థిస్తున్నాను. సారాయి వలన లాభమేమి లేకపోగా నష్టాలే చాలా ఉన్నాయి.

రాజుః అలాగేనండి. మీరు చెప్పిన ఈ విషయాన్ని జీవితాంతము ఆచరిస్తాను. అయితే, ఈ దృశ్యాన్ని నాకు ఎందుకు చూపిస్తున్నారో చెప్పనే లేదు.

పరమాత్మః ఇంతకు మునుపు ఇక్కడ నుండి ని ష్క్ర మించిన ఆ సేవకుడుని గుర్తించావా.

రాజుః నేనతణ్ణి ఇంతకు మునుపెన్నడూ చూడలేదు.

పరమాత్మః చిన్నప్పుడు నీవు పని చేశావే, ఆ టీ దుకాణపు యజమాని ఇతడే.

రాజుః ఏమిటి ? ఆ టీ దుకాణపు యజమాని ఇతనేనా. అనుక్షణము నన్ను కోప్పడుతుండేవాడు. అకారణముగా నన్ను కొడుతుండేవాడు. ఆ పాపికి ఇలా జరగవలసిందేలేండి.

పరమాత్మః (అనునయిస్తూ) అంతగా కోప్పడకు. ఎవరికి ఎలా జరగాలో, ఎలా జరగకూడదో అన్నిటినీ విధి నిర్ణయిస్తుంది. ఎవరు ఎలా చేస్తారో వారు దాని కర్మ ఫలాన్ని తప్పనిసరిగా అనుభవిస్తారు. ఈ విషయములో నీ మనసును ఎందుకు పాడు చేసుకుంటావు.

రాజుః సరే.



ఆ తర్వాత పరమాత్ముడు మరియు రాజు, రాజవీరసింహునికి మరియు అతని మంత్రులకు మధ్య జరిగిన వార్తాలాపమును విన్నారు. నగరములో మొదలైన ప్రజల తిరుగుబాటు గురించి వారు చర్చిస్తున్నారు.

మంత్రిః మహారాజా, ప్రజలను మీపై తిరుగుబాటు చేసేందుకు ప్రేరేపించిన యువకులను పట్టి బంధించాము. వారికి ఏ శిక్ష విధించాలో మీరే నిర్ణయించండి.

రాజుః ఆ నీచులను పట్టి, బంధించి మంచి పని చేశారు. నాపై తిరుగుబాటు చేసేందుకు ప్రయత్నించిన వారికి కఠిన శిక్ష అమలు చేయండి. అది చూసినవారు భవిష్యత్తులోఇంకెప్పుడూ నన్ను ఎదిరించటానికి కూడా సాహసించకూడదు.

మంత్రిః చక్కగా చెప్పారు మహారాజా. వారందరికి మృత్యు దండన విధించాలి. అదే వీరికి సరైన శిక్ష.

రాజుః అవును, ఈ బందీలను రేపు ప్రజలందరు చూస్తుండగా ఉరి తీయండి. రాజుపై తిరుగుబాటు చేసేవారందరికీ ఇలాంటి శిక్షయే పడుతుందనే హెచ్చరించండి.

రాజుః అరే, ఈ రాజు ఎంతటి క్రూరుడు మరియు నిచుడు. న్యాయ విచారణ చేయకుండానే ఆ ఖైదీలకు మృత్యు దండన విధించాడే. అయ్యో, ఇలా ఎంతమందికి మృత్యు దండన విధించాడో కదా.

పరమాత్మః ఉరిశిక్ష అనుభవించబోతున్న ఆ వ్యక్తులను గుర్తించావా ?

రాజుః లేదు, వారెవరో నాకు తెలియదు.

పరమాత్మః వారెవరో కాదు. నిన్న సాయంత్రం నిన్ను చితకబాది నీ టీ బండిని క్రింద పడవేసిన వారే.

రాజుః ఏమిటి ? వారేనా వీరు. అయితే వీరికి ఇంకా కఠినమైన శిక్ష పడాల్సిందే.

పరమాత్మః శాంతించు రాజు, ఇప్పుడే కదా నీకు నేర్పించాను– ఎవరు ఎలాంటి కర్మ చేస్తారోదాని ఫలితాన్ని తప్పించుకోలేరు, అనుభవిస్తారు. దాని గురించి ఆలోచించటము నీ పని కాదు.

రాజుః కాని, వీరందరు నాకు చాలా బాధ కలిగించారే. వారి అన్యాయాన్ని నేను ఎలా మరువగలను ?

పరమాత్మః ఈ రహస్యమంతా నీకు ఇంకాసేపట్లోనే అర్థమవుతుందిలే. కావున శాంతిగా ఉండు.



ఆ తర్వాత పరమాత్ముడు రాజును ఆ భవనములోని మరొక బందీగృహానికి తీసుకువెళ్ళారు. అక్కడ ఒకేఒక ఖైదీ ఉన్నాడు. అతని స్థితి చాలా దయనీయముగా ఉంది. అతని దేహము చాలా బలహీనముగా ఉంది. అతడిని సంకెళ్లతో బంధించారు. అతని ముఖములో ఎనలేని నిరాశ, బాధ కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. అతను జీవితంపై విరక్తి కలిగి ఉన్నాడు.

రాజుః ప్రభూ, ఈ వ్యక్తి ఎవరు ? ఇతను చాలా దయనీయమైన స్థితిలో ఉన్నాడే.

పరమాత్మః ఇతను రాజా రాజవీరసింహునికి అన్నగారు.

రాజుః రాజుగారి అన్న ఈ బందీ గృహములో ఏమి చేస్తున్నట్లు ?

పరమాత్మః ఇతను మొదటి రాజకుమారుడైనందున రాజసింహాసనము మొదటి వారసుడు మరియు రాజ్యపాలనకు యోగ్యుడు కూడా. కాని రాజవీరసింహుడు కుట్ర పన్ని తన అన్నను దేశ ద్రోహిగా నిరూపించి బంధించి, తానే రాజయ్యాడు.

రాజుః అయ్యో, ఈ వ్యక్తికి ఎంతటి అన్యాయం జరిగినది. ఈ రాజు నిజంగానే చాలా నిర్ధయుడు, క్రూరుడు. తన స్వంత అన్నను కూడా వదలిపెట్టలేదే.

పరమాత్మః వర్తమాన సమయములో ఈ వ్యక్తి ఏ రూపములో ఉన్నాడో నీవు ఊహించగలవా ?

రాజుః లేదు, ఇతను కూడా నాకు తెలియదు. ఎవరు ఈ వ్యక్తి ?

పరమాత్మః ఇతను ఇప్పుడు నీ భార్య రమరూపములో ఉన్నాడు.

రాజుః అవునా, ఇతను రమ పూర్వజన్మ రూపమా ? నిజంగా ఇతనికి చాలా అన్యాయం జరిగిందే, ఇందుకేనేమో ఆమె ఎప్పుడూ కోపంగా చిటపటలాడుతూ ఉంటుంది. ఏకారణం లేకుండానే ఎప్పుడూ నాతో పోట్లాడుతూ ఉంటుంది. రమ ఒక స్త్రీ కదా. ఆమె తన పూర్వ జన్మలో పురుషుడిగా ఉండేదా.

పరమాత్మః బిడ్డా, ఆత్మకు లింగ బేధము ఉండదు. ఒక ఆత్మ స్త్రీ జన్మ అయినా తీసుకుంటుంది లేదా పురుష జన్మ కూడా తీసుకుంటుంది. నీవు కూడా కొన్ని మార్లు పురుష జన్మ ధరించావు, కొన్ని మార్లు స్త్రీ జన్మ ధరించావు.



పరమాత్మః సరే, ఇంతవరకు నీవు చూసిన దృశ్యములోని వ్యక్తులలో నీ రూపము ఏదోగుర్తించావా ?

రాజుః మీరు నాకు చాలా రకాల వ్యక్తులను పరిచయము చేశారు. ఆలోచిస్తుంటే, నేనే రాజా రాజవీరసింహుడనేమోననిపిస్తున్నది.

పరమాత్మః సరిగ్గాఊహించావు, నీ పూర్వజన్మలో నీవే రాజవీరసింహుడవు.

రాజుః నిజంగా ? నేను అంతటి క్రూరిడిగా ఉంటినా. అన్ని అన్యాయాలు చేశానా ? చెడు కర్మలు చాలా చేశాను.

పరమాత్మః ఇంతవరకూ నీవు నీ పూర్వ జన్మల దృశ్యాలలో కొన్నింటినే చూశావు, ఆ జన్మలో నీవు అధికారబలముతో లెక్కించలేనన్ని అన్యాయాలు చేశావు. ఎందరినో బలవంతంగా బంధించావు, ఎందరి భూములను, ఆస్తులను దోచుకున్నావు, పేదల నుండి అధిక వడ్డీలు వసూలు చేశావు. ఈ జన్మలో నీకు ఇంతటి దుఃఖం కలగటానికి కారణమేమిటో ఇప్పుడు అర్థమయిందా కదా. నీ పూర్వ జన్మలో సమాజానికి చాలా దుఃఖం కలిగించావు, అందుకే సమాజమంతా ఈ జన్మలో నీకు దుఃఖం కలిగిస్తున్నది. పూర్వజన్మలో నీవు నీ తల్లి తండ్రులను కూడా ఆదరించలేదు, అంతేకాదు, ఎంతోమంది పసిపిల్లలకు తల్లితండ్రుల నీడ లేకుండా చేశావు, అందుకే అనాథ గా జన్మించవలసివచ్చింది.

రాజుః మీరు చెప్పింది కరెక్టే. ఈవర్తమాన జీవితము నా పూర్వజన్మల కర్మ ఫలితమే. ఒకరాజుగా నేను ప్రజలకు చాలా అన్యాయం చేశాను. నా పూర్వ జన్మల కర్మలకు నేను చాలా సిగ్గుపడుతున్నాను. నా జీవితంపై నాకు అసహ్యం కలుగుతున్నది.

పరమాత్మః గడచిపోయినదాని గురించి చింతించి లాభం లేదు. నీ భవిష్యమును బాగుచేసుకోవటానికి వర్తమాన జీవితమును సరిచేసుకొని, శ్రేష్ఠ కర్మలు చేయటం మంచిది.



పరమాత్మః మధురమైన ఓ బిడ్డా, ఈ జన్మలో నీవు ఎదుర్కొంటున్న బాధలకు నీవే కారణమని ఒప్పుకొంటున్నావు కదా. నేనెప్పుడూ నీకు కీడు చేయలేదు, దుఃఖమూ కలిగించలేదు.

ఈ మాట వింటూంటే రాజు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తన పొరపాటును అర్థం చేసుకున్నాడు. పరమాత్ముని ఎదుట తలవంచి, మన్నించమంటూ వేడుకోవటం ప్రారంభించాడు.

రాజుః భగవంతుడా, నన్ను మన్నించండి తండ్రి. అజ్ఞానముతోనేను మిమ్మల్ని ఎంతగానో నిందించాను. నేను చేసిన చెడు కర్మల గురించి నేను ఎరుగను. ఊహ తెలిసినప్పటినుండి నా దౌర్భాగ్యానికి మీరే కారణమనుకొంటూ మిమ్మల్నే నిందిస్తూ వచ్చాను. నా వలన చాలా పెద్దతప్పిదమే జరిగింది. నాపై కృప చూపండి, ఈ మహాపాపమును క్షమించండి. నా దౌర్భాగ్యానికి కారణమంటూ మిమ్మల్నికాని, మరెవరిని గానీ ఇకమీదట నిందించను.

పరమాత్మః ఓ బిడ్డా, నిన్ను నేనెప్పుడూ దోషిగా చూడలేదు. నేను క్షమాసాగరుడను కూడా.

రాజుః హే ప్రభూ, నిజంగా మీరు అమితమైన దయాసాగరులు. నేను మీకు ఎంతగానో ఋణపడి ఉంటాను. మీరు నాకు ఎంతటి శ్రేష్ఠ మార్గమును చూపారు, లేకుంటే నేను నా జీవితములో ఇంకెన్ని పాపాలు చేసేవాడినో కదా.

పరమాత్మః నీవిప్పుడు కర్మల జ్ఞానమును తెలుసుకున్నావు, అయినప్పటికీ నీ పూర్వ జన్మల కర్మల ఫలమును అనుభవించక తప్పదు.

రాజుః మిమ్మల్ని కలిశాక నా జీవితం సార్థకమైంది, మీరు ప్రసాదించిన శక్తి వలన నేను నా జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును సమర్థవంతంగా ఎదుర్కొనటానికి సిద్ధముగా ఉన్నాను.



రాజుః హే ప్రభూ, నాకు లభించిన ఇంతటి బాధాకరమైన జీవితానికి కారణమును తెలుసుకున్నాను. అయితే ఏ కారణాల వలన నేను ఒక రాజుగా జన్మించగలిగాను, తెలియజేయండి.

పరమాత్మఃనీవు చేసిన చెడు కర్మల ఫలముగా ఇంతటి దుఃఖభరిత జన్మ లభించినట్లు, దానికంటే ముందు జన్మలో నీవు చేసిన ఎన్నో పుణ్య కర్మల ఫలముగానే నీకు ఒక రాజుగా జన్మ లభించింది. ఆ జన్మలో నీవు ఒక మహాదాతవు. ఆ జీవితకాలములో ఎంతోమందికి సహాయం చేసి అందరి దీవెనలు అందుకున్నావు. ఆ శ్రేష్ఠ కర్మల ఫలితముగానే నీకు వైభవోపేత జీవితం లభించింది.

రాజుః నాదొక సందేహం, అంతటి మంచి వ్యక్తిగా ఉండిన నేను ఆ తరువాతి జన్మలో ఇంతటి దుష్టుడిగా ఎలా అయ్యాను ?

పరమాత్మః మునుపటి జన్మలో నీవు బాల్యము నుండియే దుష్ట మిత్రుల సాంగత్యములో గడిపావు. ఎలాంటి సాంగత్యమో ప్రభావం మనపై పడుతుంది. ఆవిధంగా బాల్యము నుండి నీవు చెడుదారిలో నడిచావు, అందరిపై దౌర్జన్యము చెయ్యటం అలవరచుకున్నాము. దానితో అహంకారము, క్రోధము పెరిగిపోయి క్రూరుడవయ్యావు.

రాజుః ఒక ఆత్మ తన ప్రతి జన్మలోనూ సుఖముగా ఉండే మార్గము లేదా ?

పరమాత్మః సుఖము తర్వాత దుఃఖము మరియు దుఃఖము తర్వాత సుఖము లభించటం నిశ్చితము. నిరంతరము సుఖముగా లేదా నిరంతరము దుఃఖముగా ఉండే వ్యక్తి ఈ లోకములో ఎవరూ లేరు. సుఖ-దుఃఖాలు ఒకే నాణానికి రెండు పార్శ్వాల వంటివి. ప్రతి ఒక్కరు రెండూ అనుభవించవలసిందే.

రాజుః అవునులెండి. అయినా, నిరంతరము సుఖంగా ఉండేందుకు ఏదైనా ఉపాయము తప్పనిసరిగా ఉండే ఉంటుంది. తెలియజేయండి.




పరమాత్మః అవును అందుక్కూడా ఉపాయము ఉన్నది. కర్మల గుహ్య జ్ఞానమును తెలుసుకోవటమే ఆ ఉపాయము. ప్రతి జన్మలోను కర్మల జ్ఞానమును కలిగి ఉంటూ నిరంతరము మంచి పనులే చేస్తూండే వారు నిరంతరం సుఖముగా ఉండగలరు. అయితే వారికి కర్మ, వికర్మల గురించి తెలియకనే పోతే, మంచి కర్మలతో పాటు చెడు కర్మలు కూడా చేస్తూ ఉంటారు.తరువాత వాటి ఫలాన్ని అనుభవించక తప్పదు.

రాజుః హే పరమేశ్వరా, ఏ కర్మలను మంచి కర్మలుగా లెక్కిస్తారో, ఏ కర్మలను వికర్మలుగా లెక్కిస్తారో ? తెలియజేయండి.

పరమాత్మః నీవు చాలా మంచి ప్రశ్న అడిగావు. వాస్తవానికి ఎలాంటి కర్మల ద్వారానైతే స్వయానికి మరియు ఇతరులకు సంతోషము లభిస్తుందో ఆ కర్మలను సత్కర్మలంటారు. తెలిసి లేదా తెలియక ఇతరులకు బాధను, దుఃఖాన్ని కలిగిస్తే దానిని వికర్మ అంటారు. ఎదుటివారికి సహాయము చెయ్యటము, సర్వులకు మేలు చేయటము పుణ్యమనబడుతుంది. మనసు ద్వారానైనా ఇతరుల గురించి చెడుగా ఆలోచన చేయటము లేదా చెడు మాటలు మాట్లాడటము కూడా వికర్మలుగా లెక్కింపబడతాయి.

రాజుః దేని ఆధారముగా ఒక వ్యక్తి నిరంతరము మంచి కర్మలే చేయగలడు ?

పరమాత్మః సత్యమైన జ్ఞానమే వ్యక్తికి సరియైన మార్గాన్ని చూపిస్తుంది.జ్ఞానము ద్వారానే వ్యక్తుల జీవితములో ఆదర్శాలు ఏర్పడతాయి. శ్రేష్ఠమైన ఈ ఆదర్శ భావాలే సత్కర్మలు చేయమని ప్రేరేపిస్తాయి. వాస్తవానికి జ్ఞానము ద్వారా ఎలాంటి వ్యక్తి అయినా తన జీవితాన్ని ఉన్నతముగా చేసుకోగలడు.



రాజుః ఒక్క జన్మలో చేసిన మంచి కర్మల మంచి ఫలితమునే అన్ని జన్మల్లోనూ అనుభవించే మార్గము లేదా ?

పరమాత్మః (నవ్వుతూ) కర్మల రహస్యాలన్నిటిని ఈరోజే తెలుసుకునేలాగున్నావే. నీవడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పటానికి ముందు నీకొక కథ చెబుతాను, శ్రద్ధగా విను.

ఒకానొక రాజ్యానికి ఒక రాజు ఉండేవాడు. అతనికి ఇద్దరు కుమారులు. ఒకసారి ఆ రాజ్యానికి ఒక గొప్ప మహర్షివచ్చారు. రాజుగారు ఆ మహర్షిని భక్తి శ్రద్ధలతో పూజించి గౌరవించారు. రాజుగారి మర్యాదలకు సంతసించిన ఆ మహర్షి అద్భుతమైన రెండు ఫలాలనిచ్చి వాటిని ఆరగిస్తే ఆయుష్షు వృద్ధి అవుతుందని చెప్పారు. ఆ ఫలాలను రాజకుమారులకు ఇవ్వటము సముచితముగా అనిపించి, రాజు తనకుమారులిద్దరిని పిలచి ఆ అద్భుత ఫలాలనిచ్చి వాటి మహిమను కూడా తెలియజేశారు. రాజకుమారులిద్దరు ఆ ఫలాలను భక్తితో స్వీకరించారు. మొదటి రాజకుమారుడు ఆ ఫలాన్ని వెంటనే తినేశాడు. కానీ రెండవ రాజకుమారుడు మాత్రం ఫలాన్ని తిని, దాని విత్తనాన్ని భద్రపరచి అదను చూసి భూమిలో నాటాడు. కొద్ది రోజుల్లో అది మొలకెత్తి, మరికొన్ని సంవత్సరాలలో అది మహా వృక్షమైంది. ఇప్పుడు రెండవ రాజకుమారుడికి ఆ అద్భుత ఫలాలు చాలా లభిస్తున్నాయి. వాటిని ఆరగిస్తూ తన ఆయుష్షును చక్కగా పెంచుకున్నాడు.

పరమాత్మః ఈ కథ ద్వారా నీకేమర్థమయింది ?

రాజుః నాకు తెలిసినంతవరకు రెండవ రాజకుమారుడే చాలా తెలివైనవాడు. అతడు తనకు లభించిన ఒక్క ఫలాన్ని అనేక ఫలాలుగా మార్చుకోగలిగాడు. మొదటి రాజకుమారుడు కూడా ఈ పద్ధతిని అనుసరించి ఉంటే అతనికి కూడా చాలా ఫలాలు లభించేవి. కాని, నేనడిగిన ప్రశ్నకు ఈ కథకు సంబంధమేమిటి ?



పరమాత్మః (నవ్వుతూ) చూడు బిడ్డా, ఆ అద్భుత ఫలమే మన మంచి కర్మల ఫలము. గత జన్మల ఫలితముగా రాజకుమారులిద్దరికి సమానమైన ఫలితమే లభించింది. అయితే మొదటివాడు దాన్ని తిని రుచిని ఆస్వాదించి అప్పుడే ఖాళీ చేసుకున్నాడు. రెండవ రాజకుమారుడు మాత్రం ఆ ఫలాన్ని తినటమే కాక విత్తనాన్ని భూమిలో నాటి ఇంకెన్నో ఫలాలను పొందాడు. దీని భావమేమిటంటే, ఏదేని వ్యక్తి తన మునుపటి జన్మలలో మంచి కర్మలు చేసి ఫల స్వరూపముగా పొందిన సుఖప్రద జీవితమును అనుభవిస్తూ కూడా మంచి కర్మలే చేస్తే దాని తర్వాతి జన్మలో కూడా తప్పనిసరిగా సుఖమే లభిస్తుంది. ఈ జన్మలో చెడు కర్మలు చేస్తే ఆ తర్వాతి జన్మ దుఃఖ భరితముగా ఉండటం మాత్రము నిశ్చితము. నీ విషయంలో అలాగే జరిగింది కదా.

రాజుః అంటే, ఒక వ్యక్తికి సుఖప్రదమైన, భాగ్యవంతమైన జీవితము లభిస్తే అతను సుఖముగా జీవిస్తూ తర్వాతి జన్మ కొరకు శ్రేష్ఠ కర్మలను కూడా ఆచరిస్తూ శ్రేష్ఠ భవిష్యమును తయారు చేసుకోవాలన్నమాట.

పరమాత్మః చక్కగా అర్థము చేసుకున్నావు. కాని సాధారణంగా, చాలామంది మొదటి రాజకుమారుడి వలెనేతమ కర్మల మంచి ఫలమును తినేసి ఖాళీ చేసుకుంటుంటారు.

రాజుః హే ప్రభూ, మేము ఈ కర్మ బంధనాలకు నిరంతరము ముక్తులయ్యే మార్గము లేదా ? ఇలా ప్రతి జన్మ తర్వాత మరొక జన్మ తీసుకుంటూనే ఉండాలా ?

పరమాత్మః కర్మ బంధనాలనుఎవ్వరూశాశ్వతముగా తప్పించుకోలేరు. ఈ భూమి పైకి వచ్చిన ప్రతి ఆత్మ, తన కర్మ బంధనాలలో చిక్కుకుంటుంది. జన్మ తర్వాత మృత్యువు, మృత్యువు తర్వాత జన్మ నిశ్చితము. ఇది అనాదిగా మరియు అవినాశిగా పునరావృతమవుతున్న జనన-మరణముల చక్రము. నిరంతరము భ్రమణము చేస్తూనే ఉంటుంది. అవినాశిగా తిరుగుతున్న ఈ చక్రము వలననే ప్రపంచము స్థిరముగా, సంతులితముగా ఉన్నది.



రాజుః ఆత్మలైన మేమందరము ఎక్కడి నుండి వచ్చాము ? ఆత్మలు ఈ భూమిపై నివసించరా ?


పరమాత్మః ఆత్మలందరికిఅసలైన, శాశ్వతమైన ఇల్లు ఈ భూమి కాదు. ఈ భూమికి చాలా దూరముగా, అంటే సూర్యుడు మరియు నక్షత్రాలకంటే పైన ఉన్న పరంధామము మన అసలైన ఇల్లు. దానినే బ్రహ్మలోకమని కూడా అంటారు. అదే మీకు, నాకు శాశ్వత చిరునామా. అది జ్యోతిర్మయ కాంతి ప్రపంచము. ఆ లోకములో ఆత్మలందరు తమ బీజ రూపములో, బిందు రూపములో పరమాత్ముడనైన నాకు సమీపములోనే ఉంటారు.

తర్వాత పరమాత్ముడు రాజుకు పరంధామ దృశ్యాన్ని సాక్షాత్కరింపజేశారు. నలువైపులా జ్యోతిర్మయ ప్రకాశమే ప్రకాశము ఆవరించి ఉన్నది. ఆ ప్రకాశ మధ్యములో నక్షత్రాల వలె మెరుస్తున్న ఆత్మలు కనిపించారు. వారంతా తల క్రిందులుగా ఉండే ఒక వృక్ష ఆకారములో అమరి ఉన్నారు. ఆ ఆత్మల వృక్షానికి పైన జ్యోతిర్బిందు పరమాత్ముడు ప్రకాశిస్తున్నాడు. కాసేపటికి రాజు ధరించి ఉన్న సూక్ష్మ శరీరము కూడా అదృశ్యమయిపోయింది, కేవలము ఆత్మ రూపములోనే ఉన్నాడు. తాను ఒక ఆత్మగా అనుభవము చేస్తున్నాడు. ఇలాంటి అలౌకిక అనుభవము అతనికెప్పుడు లభించలేదు. కాసేపటి తర్వాత అతను కర్మ బంధనాలన్నిటికి విడుదలయ్యాడు. ఆ తర్వాత రాజు తన శారీరిక రూపములోకి మరలా రాగలిగాడా !

రాజుః ఇది ఎంతటి దివ్యమైన, అలౌకికమైన అనుభవము ! ఈ లోకములో ఆత్మలు ఏమి చేస్తుంటారు ?

పరమాత్మః ఈ లోకములో ఆత్మలందరు శాంతిగా ఉంటారు. కర్మ ముక్తులై ఉంటారు. తమ అనాది రూపములో ఉంటారు. తమ పాత్ర అనుసారముగా విశ్వ నాటక రంగస్థలముపై ప్రవేశించటానికి అనువైన పరిస్థితులు, అవకాశము కొరకు ఎదురు చూస్తూ ఉంటారు. నిశ్చిత సమయములో పరంధామాన్ని వదలి భూమి పైకి వచ్చి జన్మ తీసుకుంటారు.

రాజుః ఈ విశ్వమును నాటక రంగస్థలమంటున్నారే ?




పరమాత్మ : ఎందుకంటే, ఇది నాటక రంగస్థలమే. ఇక్కడ ఆత్మలందరు సామూహికముగా ఆటలో పాల్గొంటారు. ఏదేని నాటకములోని కళాకారులు తమ తమ పాత్రలకు తగినట్లుగా వేషములను ధరించి నిర్ధారిత సమయములో స్టేజిపైకి వచ్చి అభినయిస్తున్నట్లు ఈ విశ్వ నాటక రంగస్థలముపై ఆత్మలే కళాకారులై తమ పాత్రలను అభినయిస్తుంటారు.

రాజు : ఇదంతా నాటకమా ? మరైతే ఇది ఎప్పుడు ప్రారంభమయింది ?ఎప్పుడు పూర్తవుతుంది ?

పరమాత్మ : ఈ నాటకానికి ఆది లేదు, అంతము కూడా లేదు. ఇది అవినాశిగా, నిరంతరముగా తిరుగుతూండే కాలచక్రము. ఈ కాలచక్రములో నాలుగు యుగాలున్నాయి– సత్యయుగము, త్రేతాయుగము, ద్వాపర యుగము, కలియుగము. ఈ నాలుగు యుగాలను కలిపి ఒక కల్పము అంటారు. ఒక కల్పము తర్వాత రెండవ కల్పము దాని తర్వాత మూడవ కల్పము ఇలా నిరంతరాయంగా చక్రము తిరుగుతూనే ఉంటుంది. ప్రతి యుగము 1250 సంవత్సరాల నిడివి కలిగి ఉంటుంది. అంటే ఒక కల్పానికి 5000 సంవత్సరాల నిడివి.

రాజు : అంటే ఈ కలియుగము తర్వాత మరలా సత్యయుగము వస్తుంది కదా ?

పరమాత్మ : చక్కగా ఊహించావు. కలియుగము తర్వాత మరలా సత్యయుగము వస్తుంది. ఈ చక్రము ఇలా నిరంతరంగా తిరుగుతూనే ఉంటుంది. ఈ కాల చక్రములోనున్న మరొక ముఖ్యమైన విషయము ఏమిటో తెలుసా ? ఈ సృష్టి నాటకము ప్రతి 5000 సంవత్సరాలకొకసారి తు.చ. తప్పకుండా ఉన్నదున్నట్టే పునరావృతమవుతుంటుంది.

రాజు : అంటే... ?

పరమాత్మ : అంటే, ఈరోజు నీవు ఎదుర్కొంటున్న పరిస్థితులు 5000 సంవత్సరాల క్రిందట ఎదుర్కొన్నవే. మరియు 5000 సంవత్సరాల తర్వాతకూడా ఇవే పరిస్థితులను ఎదుర్కొంటావు. ఒక ఆత్మ ప్రతి కల్పములోను ఒకే లాంటి పాత్ర ధరిస్తుంది. ఇదే శాశ్వత సత్యము. ఇదే విశ్వములోని నిశ్చిత నియమము.



రాజుః ఇది చాలా అద్భుత రహస్యము. హే ప్రభూ, నాలుగు యుగాలన్నారు కదా. వాటి గురించి వివరించండి ?

పరమాత్మః ఒక కల్పమును నాలుగు యుగాలుగా విభజించవచ్చు. అన్నిటికంటే మొదటిది సత్యయుగము, అక్కడ సృష్టి మొత్తం సతోప్రధానముగా ఉంటుంది. నలువైపులా సంపూర్ణ సుఖము, శాంతి ఉంటాయి. ప్రకృతి కూడా సతోప్రధానముగా ఉంటుంది. అక్కడ మానవులందరు సర్వగుణ సంపన్నులుగా, 16 కళా సంపూర్ణులుగా మరియు సంపూర్ణ పవిత్రులుగా ఉంటారు. అందువలన వారిని దేవీదేవతలు అని పిలుస్తారు. అంతేకాదు ఈ యుగములో పశుపక్ష్యాదులు కూడా అహింసాయుతముగా ఉంటాయి. ఈ యుగములో శ్రీ లక్ష్మీ, శ్రీ నారాయణుల రాజ్యపాలన జరుగుతుంది. ఇక్కడ ఒకే రాజ్యము, ఒకే భాష, ఒకే ధర్మము ఉంటాయి. అందువలన ఈ యుగమును స్వర్ణిమ యుగము అంటారు.

ఆ తర్వాత, పరమాత్ముడు రాజుకు సత్యయుగ సృష్టిని సాక్షాత్కరింపజేశారు. నలువైపులా ఎక్కడ చూసినా పచ్చదనమే. అక్కడక్కడ గలగల పారే సెలయేళ్లు, బహుసుందరమైన ఉద్యానవనాలు, నలుదిక్కులా స్వర్ణ మందిరాలు కనిపించాయి. ఉద్యానవనాల్లో దేవీదేవతలు అత్యంత సుందరమైన వేషభూషణాలతో రాసలీల ఆడుతున్నారు. ఆ వాతావరణమంతా పుష్పాల సుగంధముతో నిండి ఉన్నది. పక్షుల కిలకిల రావాలు మధుర గీతాల వలె వినిపిస్తున్నాయి. ఆకాశములో పుష్పక విమానాలు ఎగురుతున్నాయి. నది తీరమున పులి, ఆవు ఒకేసారి నీరు త్రాగుతున్నాయి. ఇంతటి అందమైన సృష్టిని చూసి రాజుమైమరచిపోయాడు. స్వర్ణిమ యుగ దృశ్యాల ఆనందములో తనను తాను మరచిపోయాడు.

రాజుః ఆహా, ఇదెంతటి మనోహర ప్రపంచము !ఇక్కడందరూ ఎంత సుఖముగా ఉన్నారు !ఆ తర్వాత ఏమయింది ?

పరమాత్మః పరివర్తన సృష్టి నియమము. సమయముతో పాటు సృష్టి కూడా పరివర్తన అవుతుంది. సత్యయుగము తర్వాత త్రేతాయుగము వచ్చింది. ఈ యుగములో కూడా నేల నాలుగు చెరగులా సుఖశాంతులు ఉండేవి. అయినప్పటికి సత్యయుగముతో పోలిస్తే ఇక్కడి మానవులను 14 కళా సంపూర్ణులనవచ్చు. ఈ యుగములో శ్రీ సీతా శ్రీ రాముల పరిపాలన జరిగింది.



ఈ యుగమునే రజత యుగమని కూడా అంటారు. సత్యయుగము, త్రేతాయుగము రెండింటిని కలిపి స్వర్గము అంటారు. ఇక్కడ ప్రతి ఒక్కరూ సుఖముగానే ఉంటారు.

పరమాత్మః త్రేతాయుగము తర్వాత ద్వాపర యుగము వచ్చింది. ఈ యుగము నుండి సృష్టిలో దుఃఖము, అశాంతి ప్రవేశించాయి. ప్రకృతి కూడా రజోప్రధానముగా ఉంటుంది. మానవాత్మలు 8 కళా సంపూర్ణులుగా ఉంటారు. ఈ యుగములో దుఃఖము ప్రారంభమైనపుడే పరమాత్ముడనైన నన్ను పూజించటం కూడా ప్రారంభమైంది. ప్రప్రథమముగా భారతదేశములో నిరాకార శివుడనైన నాకు శివలింగ రూపములో పూజ జరిగింది. సమయముతో పాటు భక్తి కూడా అవ్యభిచార స్థితి నుండి వ్యభిచార భక్తిగా మారిపోయింది. మానవులు అనేకమంది దేవీదేవతలకు పూజ చేయటము ప్రారంభించారు. దీనితో పాటు ఎన్నో ధర్మాలు కూడా ద్వాపరయుగములోనే స్థాపించబడ్డాయి. ఈ విశ్వము అనేక దేశాలుగా విభజింపబడింది. మానవులు భూమి కోసం, తమ ధర్మము కోసం ఎన్నో యుద్ధాలు చేశారు. నేటి సృష్టి సత్యయుగ ప్రారంభములో వలె లేదు. పవిత్ర మానవులంతా అపవిత్రులయ్యారు.కామము, క్రోధము, లోభము, మోహము, అహంకారము అనే 5 వికారాలు మానవులను వికారీలుగా చేశాయి. ఇలా సమయము గడుస్తూనే ఉన్నది. ద్వాపరయుగము తర్వాత కలియుగము వచ్చినది. ఈ యుగములో ఆత్మలందరూ తమోప్రధానముగా మరియు కళా విహీనముగా ఉన్నారు. నలువైపులా దుఃఖమే దుఃఖము.

రాజుః ఇది కలియుగమని అందరూ అంటుండగా విన్నాను.

పరమాత్మః అవును.ఇప్పుడు కలియుగమే జరుగుతున్నది. అంతేకాదు ఇది కలియుగానికి అంతిమ సమయము కూడా. ఆత్మలందరు పరంధామమును వదలి ఈ భూమి పైకి రావలసిన సమయము ఆసన్నమైనది. ఈ సమయములోనే స్వయం నేను కూడా భూమిపైన అవతరిస్తాను. కలియుగము తర్వాత సత్యయుగముఅనగా క్రొత్త కల్పము ప్రారంభమవుతుంది అని చెప్పాను కదా. మంగళకరమైన ఆ క్షణాలు సమీపించాయి. పురాతన కల్పము సమాప్తమై నూతన కల్పము ఆరంభమవుతుంది. కలియుగము తర్వాత మరలా సత్యయుగ ప్రపంచ స్థాపన జరుగుతుంది. నూతన ప్రపంచ స్థాపన కోసమే నేను ఈ భూమ్మీద అవతరించాను.



రాజు: అంటే.. వర్తమాన సమయములో మీరు ఈ సృష్టి పై అవతరించారన్నమాట !

పరమాత్మ: అవును, వర్తమాన సమయములో నేను ఈ భూమిపై అవతరించానన్న మాట వాస్తవమే.

రాజు: హే ప్రభూ, మీరిప్పుడు ఏ రూపములో అవతరించారు ? ఏ రూపములో జన్మించారు ?

పరమాత్మ: నేను అజన్ముడను, మాతృ గర్భము ద్వారా జన్మించను. నిరాకారుడను గనుక నా దివ్య కర్తవ్యములను నెరవేర్చుటకు అనుభవశాలియైన ఒక వృద్ధ మానవ శరీరాన్ని ఆధారముగా తీసుకుంటాను. అంటే వారి శరీరమును ఆధారముగా తీసుకొని సత్యయుగ సృష్టిని స్థాపిస్తున్నాను.

రాజు: తన శరీరాన్ని మీ దివ్య కర్తవ్యముల కొరకు మాధ్యమముగా అర్పించినఆ భాగ్యశాలి మానవుడు ఎవరు ?

పరమాత్మ: ఆ భాగ్యశాలి వ్యక్తి ఎవరో కాదు ప్రజాపిత బ్రహ్మ. వీరి ఆత్మ సత్యయుగములో శ్రీ నారాయణునిగా పాత్ర చేసినది. మానవాత్మలందరికెల్లా వీరే సర్వోత్తముడు. కావున వీరి శరీరాన్నే ఆధారముగా తీసుకున్నాను. ఇప్పుడు సృష్టి అంతా తమోప్రధానముగా ఉన్నది, మరియు మానవాత్మలందరూ పతితమై ఉన్నారు. పతిత ఆత్మలందరిని మరలా పావనముగా చేసి పరంధామమనే ఇంటికి చేర్చటానికే నేను వచ్చాను.

రాజు: ఇది సృష్టికి అంతిమ సమయమా ?

పరమాత్మ: ప్రియమైన బిడ్డా, ఇది సృష్టికి అంతిమ సమయము కాదు. పాత కలియుగ ప్రపంచానికి అంతిమ సమయము, అలాగే నూతన సత్యయుగ పవిత్ర ప్రపంచానికి ఆరంభ సమయము కూడా. ఆ ప్రపంచములోని ఒక సుందర దృశ్యాన్ని నీవు ఇంతకు మునుపే చూశావు కదా. అతి త్వరలో ఆ ప్రపంచము వచ్చేస్తుంది చూడు.

రాజు: ఆ సత్యయుగ ప్రపంచములోకి ఎవరెవరు వెళ్లగలరు ?



పరమాత్మః ఆ సత్యయుగ ప్రపంచానికి శ్రేష్ఠమైన ఆత్మలు మాత్రమేవెళ్లగలరు. అంటే వారు ఈ సంగమ సమయములో సాధారణ రూపములోని నన్ను గుర్తించి, నా శ్రీమతముపై నడుస్తూ తమ జీవితమును దివ్యముగా, పావనముగా చేసుకొని ఉండాలి.

రాజుః నేను ఆ ప్రపంచానికి వెళ్లగలనా ?

పరమాత్మః ఎందుకు లేదు, నీవే కాదు ఈ విశ్వములోని ప్రతి ఆత్మకు ఆ ప్రపంచానికి వెళ్ళటానికి హక్కు ఉన్నది. నేను చెప్పిన శ్రీమతముపై నడిస్తే సత్యయుగానికి వెళ్లగలవు.

రాజుః హే ప్రభూ, మీ శ్రీమతములో ఏమి చెబుతున్నారు ? దాన్ని ఆచరిస్తూ ఈ ప్రపంచానికి మాలికుడనవుతానా ?

పరమాత్మః నా శ్రీమతములో ముఖ్యమైనది – రాజయోగము.

రాజుః రాజయోగమా ! అంటే ఏమిటి ?

పరమాత్మః రాజయోగము అన్ని రకముల యోగములకు రాజు వంటిది. ఇది కఠినమైన శారీరిక క్రియ లేక హఠయోగము కాదు. అతి సరళమైన ధ్యానసాధన. నీ మనస్సును నా స్మృతిలో ఏకాగ్రము చేయటమే రాజయోగము. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నా సత్య స్వరూపమైన జ్యోతిరూపములో నన్ను తలంపు చేయటమే రాజయోగ విధానము. ఈ విధానము వలన ఆత్మ తన సంబంధాలన్నిటినీ నాతో జోడించగలదు. ఈ స్థితిలో అపారమైన శక్తులు రాజయోగ అభ్యాసకునిలో జాగృతమవుతాయి. రాజయోగమును నిరంతరము అభ్యసిస్తే ఆత్మ పావనమవుతుంది, గత జన్మల పాప కర్మలు నశిస్తాయి.

రాజుః ఏమిటి ! రాజయోగము ద్వారా నా పాప కర్మలన్నీ నశిస్తాయా ? ఇది చాలా సంతోషకరమైన వార్త. అలాగైతే నేను చేసిన పాప కర్మల ప్రాయశ్చిత్తము చేసుకోగలనన్న మాట.

పరమాత్మః అవును, నీవు రాజయోగాభ్యాసము ద్వారా నీ గత జన్మల పాప కర్మల భారమును ప్రాయశ్చిత్తము చేసుకోగలవు, పుణ్యాత్ముడిగా తయారుకాగలవు.



రాజుః నా గత వికర్మలకు ప్రాయశ్చిత్తము ఎలా చేసుకోవాలోనని సతమతవుతూ అప్పటినుండి భయపడుతూనే ఉన్నాను. హే పరమేశ్వరా, నేను మీకు ఎంతగానో ఋణపడి ఉంటాను. మీరు నాకు ఎంతటి దివ్యమైన జ్ఞాన మార్గమును చూపారు !

పరమాత్మః నేను నీ తండ్రిని, ఇది నా కర్తవ్యము.

రాజుః హే ప్రభూ, ఈ జన్మలో నేను మిమ్ములను సాకార రూపములో కలవగలనా ?

పరమాత్మః సత్యమైన హృదయముతో నన్ను వెదుకుతూ ప్రయత్నించు, నేను నీకు తప్పనిసరిగా లభిస్తాను. సరియైన మార్గము బోధించే కొందరు సోదరులతో నీవు చాలా త్వరగాకలుస్తావు.

రాజుః ఆ సోదరాత్మలెవరు ? నేను వారిని ఎలా గుర్తించగలను ?

పరమాత్మః నీవు సత్యమైన హృదయముతో నన్ను చేరాలనే కోరికను కలిగి ఉంటే చాలు, నేను నీకు లభిస్తాను. ఏదో ఒకరోజు వారు నా సందేశమును తీసుకొని నీ వద్దకు వస్తారు. వారిని గుర్తించగలగటము లేక నిర్లక్ష్యము చేయటము నీపైనే ఆధారపడి ఉంది. ఇక నేను సెలవు తీసుకుంటాను. కర్మల జ్ఞానము నీకు అర్థమైందనే అనుకుంటాను. ఇక వస్తాను. సదా సుఖముగా ఉండుము.

ఇలా మాట్లాడుతూ పరమాత్ముడు అదృశ్యమైపోయారు. వారిని ఆపడానికి రాజు ఎంతగానో ప్రయత్నించాడు. అయినా ఆపలేక పోయాడు. వెంటనే రాజుకు మెలకువ వచ్చింది. చుట్టూ చూస్తే, రాత్రి తన గుడిసెలో నిద్రపోయిన సంగతి జ్ఞాపకం వచ్చింది. అప్పటికే బాగా తెల్లారింది. కిటికీలో నుండి సూర్య కిరణాలు నేరుగా రాజుపై పడుతున్నాయి. ఇంతవరకు తనకు కలిగిన అనుభవమంతా ఒక స్వప్నమనే విషయము అర్థమైంది. తనకు తానే మాట్లాడుకుంటున్నాడు. రాజు పెదవులపై ఒక చిరునవ్వు,

రాజుః ఏమిటి ! ఇదంతా ఒక కలా ! ఏదేమైనాకాని, ఈ అలౌకిక అనుభవము మాత్రము చాలా అద్భుతము. నిజంగా వారు పరమాత్ముడే. అందుకే నాకు ఇంతటి శ్రేష్ఠమైన జ్ఞానాన్నిచ్చారు. నేనెంతటి భాగ్యశాలిని. ఆ సత్యయుగ ప్రపంచము... ఆ ఆత్మిక అనుభవము... ఎంతటి అద్భుత దృశ్యాలు !



ఇలా రాజు తనకు కలిగిన అలౌకిక అనుభవాలను తలచుకుంటున్నాడు. అంతలో అతడి భార్య రమ అక్కడకు వచ్చింది. అతన్ని చూసి కోపంగా అరవటము మొదలు పెట్టింది.

రమః ఈవేళ ఏమైంది నీకు ? ఏమిటంత సంతోషంగా ఉన్నావు. నిన్న తిన్న తన్నులు మరచిపోయావా. ఇంట్లో ఒక్క ధాన్యపు గింజ కూడా లేదు. కూర్చొని నవ్వుకుంటున్నావా ? నీకు ఏదీ పట్టదు కదా.

రాజు మాత్రము నవ్వుకుంటూనే ఉన్నాడు. గొప్ప దివ్య అనుభవము కలిగింది కదా మరి. అతడు ఖుషీఖుషీగా తనకు కలిగిన అనుభవాన్ని రమకు చెప్పటము ప్రారంభించాడు.

రాజుః ఉండవే, ఈ విషయాలన్నీ పక్కనపెట్టు, ఈ రోజు నా కలలో ఎవరు కనిపించారో తెలుసా ?

రమః ఓహో, నీకు స్వయం భగవంతుడే కలలో కనిపించినట్లు గొప్ప చెబుతావా ఏంటి ?

రాజుః అవునే, సరిగ్గా ఊహించావు. ఈరోజు నాకు కలలో స్వయం భగవంతుడే కనిపించారు. వారు నాకు అద్భుతమైన ఒక గొప్ప అలౌకిక అనుభవము కలిగించారు. నాకు కర్మల గుహ్య రహస్యజ్ఞానమును కూడా వివరించారు. అంతేకాదు రాబోయే నూతన ప్రపంచమును కూడా చూపించారు. ఇంకా దివ్య అనుభవాలు అనేకం కలిగించారు. మరొకమాట, భగవంతుడు ఇప్పుడు భూమిపై అవతరించి ఉన్నారు తెలుసా ? నేను భగవంతుడిని సత్యమైన హృదయముతో తలుస్తూ, వారిని కలవాలనే కోరికను బలంగా కలిగి ఉంటే వారు నాతో కలుస్తారట.

రాజు ఖుషీఖుషీగా రమకు అన్ని విషయాలు చెబుతున్నాడు. కాని కోపిష్టి మరియు గయ్యాళియైన అతడిభార్యకు ఒక్కమాట కూడా అర్థముకాలేదు. పైగా, రాజుకు మతి భ్రమించినదేమోనని అనుమానిస్తున్నది.

రమః ఏంటి నీ గోల, నాకు ఒక్కమాటా అర్థము కాలేదు. నిన్న ఆ గూండాలు కొట్టిన దెబ్బలకు మతి భ్రమించి పిచ్చివాడిలా మాట్లాడుతున్నావా ?



రాజుః కాదు కాదు, నాకు పిచ్చి పట్టలేదు. నాకు దివ్యమైన ఈ అనుభవాలన్నీ నిజంగానే కలిగాయి.

రమః సరే, నాతో వాదించకు. లే, వెళ్లి పని చూడు. నాతల తినకు.

భార్య మాటలకు రాజు ఏ మాత్రము బాధ పడలేదు. ఎందుకంటే అతడికి కర్మల జ్ఞానము లభించింది. రమపైన చాలా జాలి కూడా కలుగుతున్నది. మునుపటి జన్మలో తాను ఆమె పట్ల ప్రవర్తించిన తీరుతో పోల్చుకుంటే ఇప్పుడు ఆమె మాట్లాడుతున్న మాటలు ఏ మాత్రము పెద్దవి కావు. ఆ విషయాన్ని జ్ఞాపకం చేసుకున్న రాజు తన భార్యతో నన్ను క్షమించమంటూ మర్యాదగా అర్థించాలనుకున్నాడు.

రాజుః నీకు నా మాటలపైన నమ్మకము కలగకపోయినా ఫరవాలేదు, వదిలేయ్. కాని నా జీవితము ఈ రోజుటి నుండి పూర్తిగా మారిపోయిందని మాత్రం తెలుసుకో. నేను మునుపటి జన్మలోను, ఈ జన్మలో కూడా నీతో చాలా కఠినముగా ప్రవర్తించాను. నా తప్పులన్నిటిని క్షమించమని అర్థిస్తున్నాను.

రమకు ఏమీ అర్థము కావట్లేదు. రాజు ఏంటి, క్షమించమని అర్థించటమేమిటి! కాసేపు ఆమె నిశ్శబ్దముగా ఉండిపోయింది. ఆ మాటలనే తలచుకుంటూ తన పనిలో నిమగ్నమైంది.

రాజు మనసులో పరమాత్మున్ని పొందాలనే సంకల్పము బలంగా ఉన్నది. ఆ ఆలోచనలతోనే ఇంటి నుండి బయటపడ్డాడు. ఈ రోజు అతని ముఖములో సంతోషము, నడకలో ఉల్లాస ఉత్సాహాలు కనిపిస్తున్నాయి. ఆ వాడలోని వారంతా ఆశ్చర్యముగా అతడివంకే చూస్తున్నారు. ఎందుకంటే వారెప్పుడు రాజును అంత సంతోషముగా చూడలేదు మరి. రాజు నిన్న సాయంత్రము ఘోరంగా తన్నులు తిన్నాడు. ఈ రోజు ఏడవటానికి బదులు ఇంత సంతోషముగా ఎలా ఉన్నాడో విషయము అర్థం కాక అందరూ తమ పనులు మానుకొని మరీ రాజునే చూస్తున్నారు. కొద్ది సేపటి వరకు ఆ ప్రాంతమంతా నిశ్శబ్దముగా ఉండిపోయింది. రాజు మాత్రము దేనిని పట్టించుకునే స్థితిలో లేడు. అతడు ఆ అలౌకిక ఆనందములోనే మునిగి ఉన్నాడు.



బండి మీద వ్యాపారం మొదలు పెట్టాడు. తన వద్దకు వస్తున్న వారందరిని నవ్వుతూ పలుకరిస్తున్నాడు. మనసులో మాత్రము పరమాత్ముడిని మరలా ఎలా కలుస్తానో కదా అని ఆలోచిస్తున్నాడు. వస్తున్న ప్రతి ఒక్కరిని వీరే నాకు భగవంతుని సందేశమును అందిస్తారేమోనని ఆశగా ఎదురు చూస్తున్నాడు.

మధ్యాహ్నమయ్యేటప్పటికి రాజు వద్దకు నిన్నటి గూండాలు వచ్చారు. వారిని చూసిన మరుక్షణం రాజుకు ఉక్రోషం కలిగింది. కాని గత జన్మ విషయము జ్ఞాపకము వచ్చి తాను ఆ వ్యక్తులతో ఎంత క్రూరంగా ప్రవర్తించాడో తలుచుకొని వారి పట్ల తన అభిప్రాయాన్ని, భావనను మార్చుకున్నాడు. చిరునవ్వుతో వారిని పలకరిస్తూ, కూర్చోబెట్టి ప్రేమతో టీ అందిచ్చాడు. నిన్న కొట్టిన దెబ్బలకు రాజు బాగా బెదిరిపోయాడని వారు భావించారు. పైగా రాజు ఆ గూండాలతో క్షమాపణ కూడా అడిగాడు.

రాజుః క్షమించమని నేను మిమ్మలందరిని వేడుకుంటున్నాను. నేను మీ పట్ల చాలా క్రూరముగా ప్రవర్తించాను. నాపై దయ ఉంచి నన్ను క్షమించండి.

ఈ మాటలను రాజు కృత్రిమంగా కాకుండా హృదయపూర్వకముగా  చెప్పాడు. రాజు మాటలు విని ఆ గూండాలు తెల్లమొహాలు వేశారు. మేము కీడు చేస్తే ఇతడు మమ్మల్ని క్షమాపణ అడగటమేమిటని ఆలోచనలో పడ్డారు. వారిలో ఒకడు, మమ్మల్నెందుకు క్షమాపణ అడుగుతున్నావని అడిగేశాడు. అందుకు రాజు –

రాజుః నేను ఈ జన్మ గురించి మాట్లాడటంలేదు. గత జన్మలో చేసిన నా తప్పిదాలకు క్షమాపణ అర్థిస్తున్నాను. దయచేసి నన్ను మన్నించండి.

ఆ గూండాలకు రాజు మాటలు ఏమాత్రం అర్థము కాలేదు. రాజుకు పిచ్చి పట్టిందనే నిర్ధారణకు వచ్చి కాసేపు మాట్లాడుకొని నిశ్శబ్ధముగా అక్కడి నుండి లేచి వెళ్లిపోయారు.



సాయంత్రము కావస్తున్నది. వీలైనంత త్వరగా పరమాత్ముని సాకార రూపాన్ని దర్శించగలననే గట్టి నమ్మకముతో ఆ ఆలోచనలలోనే రాజు ఆ రోజంతా గడిపాడు. చీకటి పడటం మొదలైంది. ప్రతిరోజు ఈ వేళకు దుకాణం మూసివేసే రాజు ఈరోజు మాత్రము ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నాడు. భగవంతుని సందేశాన్ని తీసుకొని ఎవరైనా వస్తారని అతడు గట్టిగా నమ్ముతున్నాడు. అలా చాలా సేపు ఎదురు చూసి చూసి ఇంటికెళదామని సామాన్లు సర్దుకుంటున్నాడు. అంతలో శ్వేత వస్త్రాలు ధరించిన ఒక యువకుడు కర పత్రాలను పంచుతూ దూరంగా కనిపించాడు. రాజు ఆశగా అతని వద్దకు వెళ్ళి అదేమిటని అడగటము మొదలు పెట్టాడు.

రాజుః ఏవండీ, మీరు దేని గురించిన కర పత్రాలు పంచుతున్నారు ?

యువకుడుః (నవ్వుతూ) సోదరా, ఇందులో పరమాత్ముని సందేశమున్నది. భగవంతుడు ఈ భూమిపై అవతరించారనే శుభవార్తను ఇక్కడున్న వారందరికి తెలిపించటానికే వచ్చాను. మీరు కూడా ఈ కరపత్రమును తీసుకోండి.

ఉదయము నుండి ఎదురు చూడగా, ఇప్పుడు తాను ఊహించినట్లే పరమాత్ముని సందేశము అందింది అతడి మనస్సు సంతోషముతో పొంగిపోతున్నది. ఒక కరపత్రాన్ని తీసుకున్నాడు. ఆ యువకుడు కూడా అక్కడి నుండి వెళ్ళిపోయాడు. రాజు చాలా సేపటి వరకు ఆ యువకుడినే చూస్తూ ఉండిపోయాడు. ఆ తన్మయత్వములో తనకు చదువు రాదనే విషయాన్ని కూడా మరచిపోయాడు. ఆ కరపత్రములో సందేశము ఏమి వ్రాసి ఉందో అతనికెలా తెలుస్తుంది. ఆ యువకుడిని మరలా పిలుద్దామనుకున్నాడు కాని అప్పటికే అతడు చాలా దూరం వెళ్ళిపోయాడు. అతడి కోసం ఆ జనాల మధ్య చాలా సేపటి వరకు వెదికాడు. కాని ఆ యువకుడు కనిపించలేదు. వెంటనే చదువుకున్న తన స్నేహితుని వద్దకు ఆ కరపత్రాన్ని తీసుకువెళ్ళి అందులో ఏమి వ్రాసి ఉందో చెప్పమంటూ అర్థించాడు.

స్నేహితుడుః అరే రాజు, ఈరోజు చాలా సంతోషంగా కనిపిస్తున్నావే. ఏమిటి సంగతి ?



రాజుః ఈ రోజు నేను సంతోషాన్ని ఆపుకోలేను. ఒక యువకుడు నాకు ఈ కరపత్రాన్ని ఇచ్చి వెళ్ళాడు. ఇందులో పరమాత్ముని సందేశము ఉందట. దీన్ని చదివి చెప్పవా ?

స్నేహితుడుః (కర పత్రాన్ని చదువుతూ) మేల్కొనండి, భారతదేశములో భగవంతుడు అవతరించారు మేల్కొనండి. ప్రియమైన ఆత్మిక సోదర సోదరీమణులారా, పరమపిత శివపరమాత్ముడు సర్వాత్మలకు తండ్రి. మనలందరిని దుఃఖముల నుండి విడిపించి పాపముల నుండి ముక్తులను చేసేందుకు పరంధామము నుండి ఈ భూమిపైకి వచ్చేశారు. సర్వాత్మలకు రాజయోగమును నేర్పించి మనలను మరలా పావనము చేసేందుకు వచ్చారు...

ఇది చదువిన వెంటనే ఆ స్నేహితుడు నవ్వటం మొదలుపెట్టాడు...

స్నేహితుడుః ఇదంతా వట్టిది. ఇందులో వ్రాసిందంతా అబద్ధమే. వీరి గురించి నాకు బాగా తెలుసు. వీరు వట్టిమాటలు చెబుతుంటారు. ప్రజలను వెర్రి వాళ్ళను చేసేందుకు వీరు పన్నిన ఒక పన్నాగమిది. వీరి మాటలు నువ్వెందుకు వింటావు. మాయ మంత్రాలు కూడా చేస్తారని విన్నాను. వీరికి ఎంత దూరముగా ఉంటే అంత మంచిది.

రాజుః అవునా ? వీరిని ఇంతకుమునుపే నీవెక్కడైనా చూశావా ?

స్నేహితుడుః లేదు, ఎప్పుడూ వెళ్ళి చూడలేదు. అందరూ అంటుంటే విన్నాను. కాబట్టి నిన్ను కూడా హెచ్చరిస్తున్నాను.

రాజుః నీవు వారి వద్దకు వెళ్ళి చూడకుండానే వారు చెప్పేదంతా వట్టిదని, అబద్ధమని ఎలా అనగలవు. నిన్న రాత్రి కలలో నాకొక గొప్ప అలౌకిక అనుభవము కలిగింది. అందులో పరమాత్ముడు నాతో మాట్లాడుతూ భూమిపైన అవతరించానని చెప్పారు తెలుసా ! నేనక్కడికి తప్పనిసరిగా వెళ్తాను. నీవు కూడా నాతో రా, ఇద్దరూ వెళదాం. అక్కడ భగవంతుడు నిజంగానే లభించవచ్చునేమో కదా.



స్నేహితుడుః అమ్మో, నేను రాను. ఇలాంటి వారికి నేనెప్పుడు దూరంగా ఉంటాను. లేకుంటే నా జీవితము నాశనమవుతుంది కదా.

రాజుః సరే నీ ఇష్టము. వద్దనుకుంటే రావద్దులే. ఈ విషయాలన్నీ తెలియజేసే సేవాకేంద్రం ఎక్కడ ఉన్నదో చిరునామాచూసి చెప్పు.

స్నేహితుడుః అవును. ఇక్కడ ఆ చిరునామా వ్రాసి ఉన్నది.

అతను రాజుకు సేవాకేంద్ర చిరునామా చదివి చెప్పాడు. ఇక రాజు ఒక్కడే ఆ చిరునామాను వెదుక్కుంటూ బయలుదేరాడు. మార్గమధ్యములో వీరిని, వారిని అడిగి తెలుసుకుంటూ ఎలాగో బ్రహ్మాకుమారీస్ సేవాకేంద్రమును చేరుకున్నాడు. సంతోషంగా లోపలికి వెళ్ళాడు. అక్కడ బ్రహ్మాకుమారీ అక్కయ్యలు అతడిని ఆదర పూర్వకముగా యోగమందిరములో కూర్చోబెట్టారు. అక్కడ మరొక అక్కయ్య యోగ స్థితిలో మగ్నమై ఉన్నారు. శాంతియుతమైన ఆ వాతారవణములో మరి కొందరు సోదర సోదరీలు కూడా యోగాభ్యాసములో మగ్నమై కూర్చొని ఉన్నారు. ఆ గదిలో అనిర్వచనీయమైన ఆత్మీయత, అపురూపమైన శాంతి వ్యాపించి ఉన్నాయి. రాజు కూడా నెమ్మదిగా వెళ్ళి వరుసలో కూర్చున్నాడు. ఇంతటి గాఢమైన శాంతిని తన జీవితములో ఎప్పుడూ అనుభవము చేయలేదు.

యోగాభ్యాసము తర్వాత ఆ బ్రహ్మాకుమారీ అక్కయ్య రాజును మరొక గదిలోకి తీసుకెళ్ళారు. అక్కడ మరొక అక్కయ్య ఈశ్వరీయ జ్ఞానము వినిపిస్తున్నారు. అక్కయ్యలందరి నిస్వార్థ భావము చూసి రాజు ఆశ్చర్యచకితుడయ్యాడు. ఆ అక్కయ్య రాజుకు జ్ఞానముచెప్పటం ప్రారంభించారు. మొట్టమొదట పరమాత్ముని పరిచయమునిచ్చారు. తర్వాత ఆత్మ పరిచయమునిచ్చారు. తనకు కలలో పరమాత్ముడు చెప్పిన జ్ఞాన మహావాక్యాలనే ఈ అక్కయ్య కూడా చెబుతున్నారు. అందువలన ఇదే సత్య జ్ఞానమని, ఇదే పరమాత్ముడు చెబుతున్న జ్ఞానమని రాజుకు పూర్తిగా నమ్మకము కలిగింది. కోర్సు పూర్తయిన తరువాత రాజుకు రాజయోగము కూడా నేర్పించారు.



ఇప్పుడు రాజు ప్రతిరోజు బ్రహ్మాకుమారీ సేవాకేంద్రములో సత్సంగానికి హాజరవుతున్నాడు. అతనికి ఈశ్వరీయ జ్ఞానము చాలా బాగా నచ్చింది. రాజయోగ అభ్యాసము వలన అతని జీవితములో సంతోషము నిండుతున్నది. మొత్తమ్మీద అతడి జీవితములో మంచి పరివర్తన చోటుచేసుకుంది. ఒకప్పుడు నిరుత్సాహముగా, చిటపటలాడుతూ ఉండే రాజు ఇప్పుడు అందరితో స్నేహముగా, అందరికి తలలో నాలుకలా మెలగుతున్నాడు. సారాయి నిషాలో జోగుతూ అందరితో గొడవపడుతుండేఆ రాజు ఇప్పుడు వ్యసనముక్త జీవితాన్ని గడుపుతున్నాడు. పరమాత్ముని శ్రీమతముపై నడుస్తూ తన భాగ్యమును శ్రేష్ఠముగా చేసుకొనే ప్రయత్నములోపూర్తిగా మునిగి ఉన్నాడు.అతడి జీవితాన్ని కర్మల జ్ఞానము కొత్త మలుపు తిప్పింది.

అతడి జీవితములో కలిగిన ఈ గొప్ప మార్పును చూసి అతడి భార్య మరియు ఇరుగుపొరుగు వారు కూడా ఆశ్చర్యచకితులయ్యారు. వారందరు కూడా సేవాకేంద్రానికి వచ్చి ఈశ్వరీయ జ్ఞానమును తెలుసుకోవటము మొదలుపెట్టారు. వారందరి జీవితములోను మంచి పరివర్తన మొదలయింది.

దీని తర్వాత కొద్ది రోజులకు పరమాత్ముడిని సాకార రూపములో కలిసేందుకు అనుమతిని కూడా పొందాడు రాజు. ఆ రోజును రాజు ఎప్పటికి మరువలేడు. స్వయం భగవంతుని ఎదురుగా కూర్చొని ఈశ్వరీయ జ్ఞానము విన్నాడు. భగవంతుడు ఈ భూమిపైన అవతరించి నూతన ప్రపంచ స్థాపన చేస్తున్నాడని పరమాత్ముడిని కలిశాక అతడికి సంపూర్ణ నిశ్చయము ఏర్పడింది. అంతేకాదు, తనువు–మనసు– ధనముల ద్వారా కూడా పరమాత్ముని దివ్య కార్యములో భాగస్థుడయ్యాడు.

కర్మల జ్ఞానము కేవలము రాజుకు మాత్రమే కాదు, ఇది విశ్వాత్మలందరికి అత్యవసరము. కర్మలే మన భాగ్యమును రచించుకునే కలము. పరమాత్ముడిని కలవాలనుకుంటే మీరు కూడా కలవవచ్చు. వెంటనే మీకు దగ్గరలో ఉన్న బ్రహ్మాకుమారీస్ సేవాకేంద్రానికి వెళ్ళండి. ఈశ్వరీయ జ్ఞానమును జీవితములో ఆచరణ చేయండి. మీ జీవితమును కూడా దివ్యముగా, అలౌకికముగా తయారు చేసుకోగలరు. ఓంశాంతి.

# మానవా నీ కర్మలను గుర్తించు


శ్రేష్ఠ కర్మల అంటుగట్టి – దివ్యజీవనము సాధించు,
కర్మల రహస్యం అతి శక్తివంతం – మానవా నీ కర్మలను గుర్తించు.

శుభ కర్మల బీజము నాటితే – భాగ్య సూర్యుడుదయించు,
గొప్ప కర్మలతో పైకెదుగు – మానవా నీ కర్మలను గుర్తించు.

బాధించకెవరినీ మనసులోను, మాటలతోను – దూసుకుపో సత్కర్మలతో,
గుణముల దానం నిరతం సాగించు – మానవా నీ కర్మలను గుర్తించు.

కర్మక్షేత్రమే ఈ జగమంతా – కమలములా, అంటక వికసించు జీవితమంతా,
దేవతలా కర్మలాచరించు – మానవా నీ కర్మలను గుర్తించు.

## పరిచయముః ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయము




ఈ విశ్వవిద్యాలయము అంతర్జాతీయ ఆధ్యాత్మిక విద్యా సంస్థ. 1936వ సంవత్సరములో ప్రజాపిత బ్రహ్మా సాకార మాధ్యమము ద్వారా స్వయం పరమపిత పరమాత్ముడు దీనిని స్థాపించారు. ఈ సంస్థ భారతదేశములోనే కాక విశ్వ వ్యాప్తముగా 139 దేశాలలో 8500 సేవాకేంద్రముల ద్వారా సర్వ జనులలో ఆధ్యాత్మిక చైతన్యమును కలిగిస్తున్నది. బ్రహ్మాకుమారీ సంస్థ ఐక్యరాజ్య సమితిలో N.G.O గా మరియు UNICEF, ECOSOC లో సలహాదారుగా సేవలందిస్తున్నది. ఐక్యరాజ్యసమితి ద్వారా అంతర్జాతీయ స్థాయిలో శాంతిదూత అవార్డును అందుకున్నది. నేటి స్పీడు యుగములో నగరీకరణ, ఆధునీకరణ వలన ఉత్పన్నమవుతున్న అనేక సమస్యలకు సమాధానముగా మరియు సర్వ జనులలో సంతులనాత్మక, బహుముఖ వికాసమును కలిగించుటకు అనేక రకములైన కోర్సులను ఉచితముగా అందిస్తున్నది. ఒత్తిడి పై నియంత్రణ, మహిళా జాగృతి, సకారాత్మక వ్యక్తిత్వధారణ, పర్యావరణ పరిరక్షణ, సంపూర్ణ ఆరోగ్యము వీరు అందిస్తున్న కోర్సులలో కొన్ని. నిశ్చలచిత్తురాలు, జ్ఞానప్రజ్ఞాశీలియైన అద్వితీయమూర్తి ఆదర్శనీయజానకి దాదీ గారి మార్గదర్శకత్వములో ఈ విశ్వ విద్యాలయ సేవా కార్యక్రమాలు నిర్వహింపబడుతున్నాయి. పరమపిత పరమాత్ముని సూచనల ద్వారానిరాటంకముగా తన గమ్యం వైపుకు దూసుకుపోతున్న ఈ సంస్థ తన అంతర్జాతీయ ముఖ్యాలయమును ఆబూ పర్వతము పై వెలసిన పాండవ భవనము నందు ఏర్పాటు చేసుకొన్నది.

మరిన్ని వివరములకై మా వెబ్ సైట్‌ను సంప్రదించండి
**www.brahmakumaris.com**
**www.bkwsu.org**

Telugu Edition